క్లుప్తంగా

ఉపాధి వేతనదారులకు భృతి అందించాలి



చిట్టేయవలసలో వేతనదారులతో మాట్లాడుతున్న అప్పారావు

గజపతినగరం రూరల్: ఉపాధి హామీ వేతన దారులకు ఏడాదికి రూ.12 వేలు భృతి అందించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్టేయవలస, పాత బగ్గాం, సాలి పేట, గంగచోళ్లపెంట గ్రామాల్లో శనివారం ఉపాధి వేతనదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో వేతనదారులకు నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్సకిట్లు అందుబాటులో లేవని అన్నారు. ప్రభుత్వం తక్షణమే వేతనదారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మంటలను అదుపు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్, ఫైర్ సిబ్బంది

గజపతినగరం: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీనివాస నర్సింగ్ హోమ్‌లో సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి ఎం. ఎస్.వి.రవిప్రసాద్, ఫైర్ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, ఇతర కారణాల వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలను ఫైర్ ఆఫీసర్ రవిప్రసాద్ సూచించారు. ఒక వేళ ప్రమాదం జరిగితే మంటలను ఏ విధంగా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. శ్రీనివాస నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ బి.లక్ష్మీనరేన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



బురదపాడులో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీలో మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వసాది, బురదపాడు, కొర్లాం గ్రామాల్లో సిమెంట్ రోడ్లను శనివారం ప్రారంభించారు. అలాగే బురదపాడులో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి, తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి, ఎంఈఓ విజయకుమారి, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం



స్నాతకోత్సవంలో చిన్నారులు, అతిథులు

శృంగవరపుకోట: భర్తాపురం గ్రామం వద్ద ఉన్న డాక్టర్ వరలక్ష్మి స్కూల్‌లో శనివారం స్నాతకోత్సవాన్ని సంబరంగా నిర్వహించారు. కిండర్‌గార్డెన్ విద్య పూర్తి చేసి ప్రాథమిక స్థాయిలోకి అడుగిడుతున్న చిన్నారులు కాన్వొకేషన్ డ్రెస్‌లతో హంగామా చేశారు. వీరికి వరలక్ష్మి విద్యాసంస్థల కరస్పాండెంట్ కె.రాజేంద్రప్రసాద్, వరలక్ష్మి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటరమణ, డి.వి.ఎల్. స్కూల్ ప్రిన్సిపాల్ వై.జానకీదేవి సర్టిఫికెట్‌లు, మెడల్స్ ఇచ్చి అభినందించారు. ప్రిన్సిపాల్ జానకీదేవి మాట్లాడుతూ పిల్లలను శారీకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దేలా తల్లిదండ్రులు ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులను మొబైల్‌కి దూరంగా ఉంచాలని కోరారు. స్నాతకోత్సవం సందర్భంగా చిన్నారులు డ్యాన్స్‌లు, రైమ్స్, పద్యాలు, ఆటలు, పాటలతో అలరించారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులాహ్వానం

చీపురుపల్లి: నిరభ్యంతర భూములను ఆక్రమించుకుని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివాసం ఉంటున్న వారంతా ఆ భూము లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.రాజారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ నంబర్ 30 ప్రకారం 2019 అక్టోబర్ 15 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో నిరభ్యంతర భూముల్లో ఆక్రమణలు జరిపి పక్కా నివాసాలు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ చేయనున్నట్లు తెలిపారు. అలాంటి వారంతా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 2025 డిసెంబర్ 31 వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సీహెచ్‌సీలకు మంగళం..!



గత ప్రభుత్వంలో దత్తిరాజేరు రైతు భరోసా కేంద్రంలోని సీహెచ్‌సీ సంఘానికి యంత్ర పరికాలు అందజేసిన వ్యవసాయ అధికారులు(ఫైల్)

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) ద్వారా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు
- మండలానికి 14 రైతు సంఘాలకు పరికరాలు అందించిన గత ప్రభుత్వం
- ఈ విధానంతో విస్తృతంగా ప్రయోజనం పొందిన రైతులు
- కూటమి ప్రభుత్వంలో వ్యక్తిగతంగా రాయితీపై యంత్ర పరికరాలు అందజేత
- కూటమి సానుభూతి పరులకు దక్కిన యంత్రపరికరాలు

దత్తిరాజేరు: ప్రజలు, రైతులు, అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటు, సంక్షేమం అందిస్తూ వారిని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణలు, వ్యవస్థలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా చిన్నా భిన్నం చేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ అందించేందుకు నెలకొల్పిన సచివాలయ వ్యవస్థను ఓ వైపు నిర్వీర్యం చేస్తుండగా... సచివాలయాలకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలదీ అదే పరిస్థితి. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ సేవలకు మంగళం పాడిన కూటమి ప్రభుత్వం.. వాటి పరిధిలో ఉన్న కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)కు సైతం చరమగీతం పాడింది. రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించేందుకు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈపథకం ద్వారా గ్రామాల్లో రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వాటికి కస్టమ్ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ)గా పేరుపెట్టారు. ప్రతీ సంఘానికి రూ.12 నుంచి రూ.15 లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను అందించారు. గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో ఒక్కొక్క మండలానికి 14 కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటికి 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంక్ రుణంతో ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, రోటో వీటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, దుక్కు సెట్లు తదితర వ్యవసాయ పరికరాలు అందించారు. ఈ యంత్ర పరికరాలను సంఘంలోని రైతులు వినియోగించుకోవడంతో పాటు గ్రామాల్లోని మిగతా రైతులకు అద్దె ప్రాతిపదికన అందించే వారు. దీంతో రైతులందరికీ ప్రయోజనం కలిగేది. కానీ కూటమి ప్రభుత్వం రైతులకు సంఘాలుగా కాకుండా వ్యక్తిగతంగా కొందరికి పరికాలు పంపిణీ చేసి మమ అనిపించింది. కూటమి సానుభూతిపరులకే యంత్రపరికరాలు దక్కాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా సీహెచ్‌సీలకు యంత్రపరికరాలు అందజేసి ఉంటే అందరికీ ప్రయోజనం కలిగేదని రైతులు అంటున్నారు.

గత ప్రభుత్వ విధానంతోనే మేలు



గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా ట్రాక్టర్‌తో పాటు వివిధ యంత్ర పరికరాలు అందించారు. సంఘంలో ఉన్న రైతులతో పాటు మిగతా రైతులు కూడా అద్దె చెల్లించి వాటిని వాడుకునే వారం. తక్కువ అద్దెకు యంత్ర పరికరాలు లభించడం వల్ల పెట్టుబడి ఖర్చు కొంత మేర తగ్గేది. ఇప్పుడు కొంతమందికే యంత్రపరికరాలు ఇవ్వడం వల్ల, వారికి తప్ప మిగతా రైతులకు ప్రయోజనం ఉండదు.

– బి అప్పన్న, రైతు, షికారుగంజి గ్రామం, దత్తిరాజేరు మండలం.

రైతులందరికీ మంచి చేయాలి



గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాల అండగా ఉండి ఆదుకునే వారు. కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా రైతులందరికీ మంచి చేయాలి. ప్రధానంగా యంత్ర పరికరాలను వ్యక్తిగతంగా వినియోగించుకునేలా కొంతమంది రైతులకే ఇవ్వడం సరికాదు. గతంలో మాదిరిగా సంఘాలను ఏర్పాటు చేసి యంత్ర పరికరాలు అందిస్తే, రైతులంతా వినియో గించుకుంటారు.

– ఈదుబిల్లి నర్సింగరావు, రైతు, చౌదంతివలస, దత్తిరాజేరు మండలం.

రైతులకు పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు..?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సభ్యులు



మాట్లాడుతున్న తహసీల్దార్ నీలకంఠరావు

కొత్తవలస: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని, ఇప్పటి వరకు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూపాయి కూడా పెట్టుబడి సహాయం అందలేదని, ఎప్పుడిస్తారో చెప్పాలని ఏఓ మాదురీ శరణ్యను మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా నివేదికలు సభకు చదివి వినిపించారు. ఏఓ మాదురీ శరణ్య వ్యవసాయశాఖ గురించి వివరిస్తుండగా...తుమ్మికాపల్లి సర్పంచ్ కొండలరావుతో పాటు మరికొందరు సభ్యులు కలుగుజేసుకుని అన్నదాత సుఖీభవ గురించి ప్రశ్నించగా, ఆమె సమాదానం చెప్పలేక మిన్ను కుండిపోయారు. గ్రామాల్లోకి 104 వాహనాలు రావడం మానేశాయిని, దీర్ఘకాలిక రోగులకు నెలనెలా ఉచితంగా అందించే మందుల పంపిణీ సైతం నిలిచిపోయిందని సభలో పలువురు సభ్యులు ఆరోపించారు. విద్యుత్ ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గులు కారణంగా వీధిలైట్లు, ట్రాన్స్‌ఫారమ్స్ పేలిపోతున్నాయని అప్పన్నదొరపాలెం, కంటికాపల్లి,తుమ్మికాపల్లి గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయాల్లోని జూనియర్ లైన్‌మన్‌లు ఎక్కడా కనబడడం లేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ కంటకాపల్లి పంచాయతీ పరిధిలో చెరువులో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలసత్వం వహించిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని మండల అధికారులకు సూచించారు. తహసీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ 2009కి ముందు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మించుకున్న వారు ఉంటే ఆభూములను క్రమబద్ధీకరిస్తామని, గ్రామాల్లో అటువంటి వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓ ఎస్.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేస్తే చర్యలు

బొండపల్లి: గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు శనివా రం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా సరే మట్టి, గ్రావెల్ తవ్వేందుకు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించిఅభ్యంతరాలు లేకుంటే అనుమతులు ఇస్తా మని పేర్కొన్నారు. గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలపై నిఘా పెట్టాలని వీఆర్‌ఓలను ఆదేశించారు.

సారా రహిత సమాజమే ధ్యేయం



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: సారా రహిత సమాజాన్ని తీర్చిదిద్దడమే ధ్యేయంగా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమంపై మండల అధికారులు, ఎక్సైజ్‌శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. మండలంలో సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఎంపీపీ చర్చించారు. మండల శివారు ప్రాంతాలపై దృష్టి సారించాలని, అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ శేషుబాబు, ఎక్సైజ్ సీఐ వెంకటరావు, డిప్యూటీ తహసీల్దార్ నారాయణమ్మ, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు పరీక్ష రేపు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు సోమవారం పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం 9గంటలకు విద్యార్థులు తమ హాల్‌టికెట్లు, ఆధార్‌కార్డు జెరాక్స్ తీసుకుని మోడల్ స్కూల్ వద్ద హాజరు కావాలని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు.

వ్యర్థాల సేకరణ నిరంతర ప్రక్రియ



ఎస్.కోటలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు

శృంగవరపుకోట: ఆరోగ్యకరమైన సమాజం కోసం వ్యర్థాల సేకరణ నిరంతర ప్రక్రియ కావాలని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు అన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ఎస్.కోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థుల ఆంగ్లభాష నైపుణ్యాన్ని పరిశీలించిన అనంతరం ఈ–వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో ఎమ్మెల్యే లలితకుమారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్‌తో కలిసి మొక్కలు నాటారు. అక్కడి నుంచి గ్రామ సచివాలయం వరకు ర్యాలీ చేశారు. సచివాలయం వద్ద సభలో అహ్మద్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర సాధన నిరంతర ప్రక్రియ కావాలని, కార్యక్రమంలో ప్రజ లు భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు తమ వద్ద ఉన్న పని చేయని స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, ప్లాస్టిక్ వస్తువులను ఈ–వేస్ట్ సెంటర్‌లో ఇవ్వాలని సూచించారు. వీటిని శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ చేయాల్సి ఉందన్నారు. స్థానిక కన్నెంగెడ్డ ప్రక్షాళన ప్రతిపాదనను ప్రస్తావించిన ఎమ్మెల్యే లలితకుమారికి బదులిస్తూ అమరావతి స్థాయిలో ప్రయత్నం చేస్తామన్నారు. ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ విజన్ 2047లో భాగంగా ఆరోగ్యం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అనంతరం అహ్మద్‌బాబు స్థానిక పీఏసీఎస్‌లో తనిఖీలు చేశారు. పీఏసీఎస్‌లో కార్యకలాపాలు తెలుగులో జరగాలని, అందుబాటులో ఉన్న సాఫ్ట్‌వేర్ వినియోగించాలని చెప్పారు. బ్యాంక్ రికార్డుల నిర్వహణ సిబ్బంది. పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఏసీఎస్‌లకు సంబంధించిన యాప్ త్వరలో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈకేవైసీ పూర్తిచేసి మెంబర్‌షిప్ డ్రైవ్ చేయాలన్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ, డీపీఓ టి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్డీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత



శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ డిపోలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎం రమేష్



చీపురుపల్లి: మూడు రోడ్ల జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



గజపతినగరం: గజపతినగరంలో రోడ్లను శుభ్రం చేయిస్తున్న అధికారులు



గుర్ల: కెల్ల లో ప్రతిజ్ఞ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి పెంటోజీరావు, అధికారులు



దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రత్యేక అధికారి బేగం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, అధ్యా పకులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యా లయాలు, పాఠశాలలు, విద్యాలయాల్లో శనివారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు నిర్వహించి, పరిశుభ్రత పాటిస్తామని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఈ– వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

– సాక్షి నెట్ వర్క్

● బెల్లానకు సత్కారం



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా నియమితులైన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను చీపురుపల్లిలోని ఆయన నివాసంలో చీపురుపల్లి మేజర్ పంచాయతీ 7, 8, 9వ వార్డు సభ్యులు, మాజీ మెంబర్లు, ప్రజలు, అభిమానులు శనివారం సత్క రించారు. ఈసందర్భంగా వారంతా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పార్టీ పదవుల్లో బెల్లానకు స్థానం లభించడం సంతోషకరమని, ఇలాంటి పదవి కట్టబెట్టిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షు డు జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. వార్డు మెంబర్లు, ఎంపీటీసీ లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి గోవింద, అప్పికొండ ఆదిబాబు, మహంతి ఉమ, ముల్లు పైడిరాజు, ఇప్పిలి తిరుమల, గంట్యాడ విష్ణు, గవిడి కళ్కి, అంబటి లోకేష్, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సతివాడ అప్పారావు, మీసాల రామారావు, సతివాడ ఆదికృష్ణ, రుంకాన రాజేష్, రఘుపాత్రుని శ్రీను, తది తరులు పాల్గొన్నారు.

– చీపురుపల్లి

● సామూహిక సీమంతం



పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్ వైజ ర్ నాగమణి ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు సీమంతం చేశారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులకు పండ్లు , స్వీట్లు పంపిణీ చేసి ఆశీర్వదించా రు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఎక్కువగా ఆకు కూరలు, పాలు, గుడ్లు, పప్పు దినుసులు ఆహారంగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

– దత్తిరాజేరు

● రన్ ఫర్ జీసస్



ఏసుక్రీస్తు పునరుత్థానుడు అయినందుకు గుర్తుగా చీపురుపల్లి పట్టణంలోని ఆంధ్రాబాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు శనివారం సాయంత్రం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రాబాప్టిస్టు చర్చి వద్ద జెండాలతో ప్రారంభమైన ర్యాలీ లావేరురోడ్, మూడు రోడ్ల జంక్షన్, మెయిన్ రోడ్, ఆంజనేయపురం తదితర ప్రాంతాల్లో సాగింది. ఆంధ్రా బాప్టిస్టు చర్చి సేవకులు ధర్మారావు, పాస్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

– చీపురుపల్లి

వైద్య సేవలు మెరుగు పడాలి

- జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు



పీహెచ్‌సీలో వృద్ధుడితో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు

గంట్యాడ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడాలని జిల్లా ప్రత్యేకాధికారి అహ్మద్‌బాబు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. మందులు అందించే గది, ల్యాబొరేటరీ, స్టాక్ రూమ్, రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన వృద్ధుడితో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో ఖరీదైన మందులు, ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగిస్తూ, రోగులకు మరింత మెరుగ్గా సేవలు అందించాలని, సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని వైద్యాధి కారులను ఆదేశించారు. ఆయన వెంట జేసీ ఎస్.సేతు మాధవన్, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డీఎంఓ మణి, ఎంపీడీఓ రమణమూర్తి, తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ హేమలత, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



గోపాలపల్లిలో ప్రచారం చేస్తున్న ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: తల్లిదండ్రులు తమ పిల్లలను అన్ని సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పిం చాలని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సూచించారు. ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు రెండు బృందా లుగా విడిపోయి మండలంలోని ఎస్.జి.పేట, సీతంపేట, కృష్ణాపురం,మధుపాడ, వేములాపల్లి, గోపాలపల్లి, రేవళ్లపాలెం, సీతారాంపురం గ్రామాల్లో శనివారం ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి అయిదోతరగతి పూర్తవుతున్న విద్యార్థులను ధర్మవరం హైస్కూల్‌లో చేర్పించేలా చూడాలని కోరారు. తల్లిదండ్రులను కలిసి తమ పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, వసతులను వివరించారు.

ఉచిత సీట్లకు దరఖాస్తుల స్వీకరణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పి.రామారావు శనివా రం ఓ ప్రకటనలో సూచించారు. ఆర్టీఈ యాక్ట్ ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లను లాటరీ పద్ధతిలో కేటాయించేందుకు షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన నోటిఫికేషన్, ఉత్తర్వులను ప్రభుత్వ విద్యాశాఖ జారీ చేసిందని తెలిపారు. అనాథ పిల్లలు,హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ,మైనార్టీ,ఓసీ వర్గాలకు చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. ఈనెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.